
ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 22 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# రాహుల్ ఒకలా.. రేవంత్ మరోలా

సీఎంకు అదానీ ఏం ఇచ్చారో విచారణ జరగాలి

మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్



హైదరాబాద్ : బస్సు తప్ప కాంగ్రెస్ హామీలన్నీ తుస్సు అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అదానీపై ఢిల్లీలో రాహుల్ ఒకలా మాట్లాడుతుంటే..ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డి మరోలా మాట్లాడు తున్నారని చెప్పారు. రేవంత్‌కి అదానీ ఏం ఇచ్చారో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పోలీసులు మా కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, అక్రమ కేసులు పెట్టినవారికి తగిన శాస్తి జరుగుతుందని అన్నారు. దళితబంధు నిధులు విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## అర్బన్ డిజాస్టర్స్, ఆక్రమణల

# నివారణకే హైడ్రా

చెరువులకు లేకుండా పోయిన కనెక్టివిటీ

డిజాస్టర్స్ లోను మార్పులు

కంట్రీలో పెరిగిన అర్బనైజేషన్

హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ : అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్ ల కోసం హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైదరాబాద్ అంటేనే ఒక చెరువుకు మరొక చెరువుకు కనెక్టివిటీ ఉండి గొలుసు కట్టు చెరువులుగా పేరుగాంచిన నగరం అని



హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ అన్నారు. మెట్రోలా జికల్ డిపార్ట్మెంట్ 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బేగంపేట లోని సెస్ కార్యాలయంలో తెలంగాణ వెదర్ క్లైమేట్ సర్వీసెస్ శుక్రవారం వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రంగనాథ్ మాట్లాడుతూ.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్ ల కోసం హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. హైడ్రా జిహెచ్ఎంసీలో భాగం కాదన్నారు. హైడ్రాకు మొదటి కమిషనర్ గా ఉండటం సంతోషంగా ఉందన్నారు. జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పనిచేస్తుం దన్నారు.

**పరిరక్షణే హైడ్రా లక్ష్యం**

ఆక్రమణలకు గురవుతున్న వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ పరిరక్షణకు హైడ్రా పని చేస్తుందన్నారు. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది. ఇప్పుడు కనెక్టివిటీ లేకుండా పోయిందన్నారు. నాలాలు సరిగా లేనందున గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతున్నామని అన్నారు. డిజాస్టర్స్ లో కూడా మార్పులు వస్తున్నాయి. కంట్రీలో అర్బనైజేషన్ పెరుగు తుందన్నారు. తెలంగాణలో అర్బనైజేషన్ పెరు గుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉందన్నారు. సిటీలో 2, 3 సెంటీమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుం దన్నారు. హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుందన్నారు.

## విద్యుత్ ప్రాజెక్టులు

# అదానీకి కట్టబెట్టే యత్నం

ప్రయత్నించిన సీఎం రేవంత్

అందుకే వర్సిటీకి రూ.100 కోట్ల విరాళం

రూ.12,400 కోట్లతో ఎంవోయూలు ఒప్పందం!

కెన్యాలో ఒప్పందాలు రద్దు చేసుకున్న అక్కడి ప్రభుత్వం

తెలంగాణలో ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవడం లేదు

మాజీమంత్రి కేటీఆర్



హైదరాబాద్: అంతర్జాతీయంగా మళ్లీ అదానీ వ్యవహారం బయటపడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అమెరికా నుంచి ఆఫ్రికా వరకు ఇది వెలుగు చూసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడారు.

మా పార్టీ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు అదానీ తెలంగాణకు రాలేదన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలియకుండా రేవంత్‌రెడ్డి ఆయనకు రెడ్‌కార్పెట్ పరిచారా? అని ప్రశ్నించారు. రూ.12,400 కోట్లతో ఎంవోయూలు కుదుర్చుకున్నారని విమర్శించారు. విద్యుత్‌కు సంబంధించి ప్రాజెక్టులు అదానీకి అప్పగించేందుకు సీఎం ప్రయత్నించారన్నారు. స్కిల్ యూనివర్సిటీకి ఆయన రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. వ్యాపారవేత్తలు రూ.40వేల కోట్ల విరాళాలు ఉచితంగా ఇవ్వరని రాహుల్‌గాంధీ అన్నారని, జాతీయ పార్టీకి ఓ జాతీయ విధానం ఉండాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాలను కెన్యా రద్దు చేసిందని, తెలంగాణ ప్రభుత్వం ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవడం లేదు? రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# వీడిన మర్డర్ మిస్టరీ

నిందితుడు బిట్టు కుమార్ అరెస్టు

భార్యతో అసభ్యంగా ప్రవర్తించనే కాంట్రాక్టర్ పాస్వన్ హత్య




మెదక్: మర్డర్ మిస్టరిని పోలీసులు ఛేదించారు. గత శనివారం హత్య చేసి పరారైన నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా తుప్రాన్ సీఐ రంగా కృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ లు వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ చివరిలో శ్రీరామ్ పాండరి తన నూతన గృహ నిర్మాణ కాంట్రాక్టును ప్రమోద్ పాశ్వన్ కు ఇచ్చాడు. ఈ క్రమంలోనే అతని వద్ద బిట్టు కుమార్, భార్య పూజ పని చేస్తున్నారు. సివిల్ వర్క్ చేస్తుండగా శనివారం పాశ్వన్ పూజతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఈ విషయం భర్త తో చెప్పింది. బిట్టు కోపంతో అక్కడే ఉన్న కర్రతో తలపై మోదాడు. ఈ ప్రమాదంలో పాశ్వన్ అక్కడికక్కడే మృతి చెందాడు. బిట్టు కుమార్ ఆయన భార్య, పిల్లలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సుభాష్ గౌడ్, తమ పోలీస్ సిబ్బందితో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.

# అదానీని అరెస్టు చేయాలి

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేశారని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని కోరారు. అదానీ దాదాపు రూ.2వేల కోట్ల మేర లంచాలు పంచారని ఆరోపించారు. ఆయన అవినీతిపై రాహుల్‌గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదన్నారు. అర్హత లేక పోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారన్నారు. ప్రధాని మోదీ అండతో అనేక విమానాశ్రయ కాంట్రాక్టులు చేజిక్కించుకుని అవినీతి సామ్రాజ్యం స్థాపించారని తెలిపారు. 2014 తర్వాత అదానీ సంపద ఎలా పెరిగిందో చూశామన్నారు. రూ.వేల కోట్ల అవి నీతికి పాల్పడిన అదానీపై చర్యలేవి?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

# ఆర్జే వెంచర్స్ ఘరానా మోసం

600 మంది నుంచి రూ.150 కోట్లు వసూలు

అపార్ట్ మెంట్, ఫాంల్యాండ్ పేరిట దగా

న్యాయం చేయాలని బషీర్ బాగ్ సీసీఎస్ ఎదుట ధర్నా

హైదరాబాద్ లో మరో భారీ మోసం వెలుగుచూసింది. ప్రీ లాంచింగ్ పేరిట ఆర్జే వెంచర్స్ రూ.150 కోట్లు స్కాం చేసింది. ఏకంగా 600 మందిని నిండా ముంచేసింది. బషర్ బాగ్ సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులు




ఆందోళన చేస్తున్నారు. నారాయణఖేడ్, ఘట్కేసర్, పటాన్ చెరు ప్రాంతాల్లో అపార్ట్ మెంట్లు, ఫాంల్యాండ్ ల పేరిట ప్రముఖులతో ప్రకటనలు చేయించారు. 2020 నుంచి ఇప్పటి దాకా 600 మంది దగ్గర నుంచి రూ. 20 లక్షల నుంచి 50 లక్షల వరకు కట్టించుకున్నారు. బాధితులు నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదని మండిపడుతున్నారు. ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. గట్టిగా అడిగితే చెక్కులు ఇచ్చారు గానీ అవి కూడా బౌన్స్ అయ్యాయని తెలిపారు. దీంతో బాధితులంతా బషీర్ బాగ్ లోని సీసీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. ఆర్జే వెంచర్ ఆస్తులమ్మి తమకు న్యాయం చేయాలన్నారు.

# ఉత్తరప్రదేశ్ లో ఘోరం

ఎఫ్ సీఐ గోదాం 145 కోతులు మృతి

పోలీసులకు ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి



లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని హత్రస్‌లో కోతుల మృతి ఘటన కలకలం రేపుతోంది. ఎఫ్‌సీఐ గోదాంలో 145 వానరాలు ప్రాణాలు కోల్పోయాయి. ఆలస్యంగా బయటకు వచ్చిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక నేత హర్షిత్ గౌర్ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తెలిసిన వ్యక్తి ఒకరు ఎఫ్‌సీఐ గోదాంలో పనిచేస్తున్నారని, కోతులను పాతిపెట్టిన విషయం ఆ ఉద్యోగి వల్లే తనకు తెలిసిందని చెప్పారు. నవంబర్ 9న ఆహారధాన్యాలకు చీడపీడలు రాకుండా రసాయనాలు పిచికారీ చేసిన తర్వాత ఆ కోతులు గోదాంలోకి ప్రవేశించి చనిపోయాయని ఆ ఉద్యోగి ద్వారా తెలిసింది అని అన్నారు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చానని చెప్పారు. ఘటన జరిగిన వెంటనే ఉద్యోగులు ఆ విషయాన్ని బయటకు చెప్పలేదని ఫిర్యాదులో ఆరోపించారు.